సాక్షి e-paper

# 'తెలుగు' సభలపై మాంద్యం దెబ్బ!

చికాగో, ఫ్లోరిడా: ఆర్థిక మాంద్య ప్రభావం ప్రపంచ దేశాలతో పాటు తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా), నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) మహాసభలపై కూడా పడింది. ఐటీ, బీపీవో రంగాల్లో భారీగా ఉద్యోగుల తొలగింపు, జీతాల కోత నేపథ్యంలో తానా, నాట్స్ మహాసభల ప్రవేశ రుసుంను నిర్వాహకులు తగ్గించారు. భోజనంతో సంబంధం లేకుండా కేవలం మహాసభల్లో పాల్గొనేందుకు మాత్రమే ఈ రెండు సంస్థలూ ప్రవేశ రుసుంను నిర్ణయించాయి. రెండురోజులు పాల్గొనేవారికి రాయితీ సదుపాయం కల్పించడం గమనార్హం. కేవలం మహాసభలను వీక్షించేందుకు ప్రతిరోజుకు 50 డాలర్లు, మూడు రోజులకు కలిపి 80 డాలర్లుగా తానా నిర్ణయించగా, నాట్స్ ఒక్కొక్కరికి రోజుకు 40 డాలర్లుగా నిర్ణయించింది. తెలుగు విద్యార్థులు, నిరుద్యోగులకు మరింత రాయితీ ప్రకటించి, తక్కువ రేట్లను నిర్ణయించడం విశేషం. ఇదిలావుండగా అమెరికాలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు విమానాల్లో మహాసభలు జరుగుతున్న ప్రదేశాలకు వచ్చేందుకు వెనుకాడుతున్నారు. సొంత కార్లు, ఇతర వాహనాల్లోనే మహాసభలకు చేరుకుంటున్నారు.

## వచ్చే ఏడాది ఒకే ప్రాంతంలో!

ఈ ఏడాది తానా మహాసభలు అమెరికాలోని చికాగోలో జరుగుతుండగా, నాట్స్ మహాసభలు ఓర్లాండోలో జరుగుతున్నాయి. 2011లో జరగబోయే మహాసభలను ఈ రెండు సంస్థలూ ఒకే ప్రాంతంలో నిర్వహించనున్నాయి. వచ్చే ఏడాది జూలై 1 నుంచి 3 వరకు న్యూజెర్సీలో ద్వితీయ మహాసభలను నిర్వహించుకోవాలని నాట్స్ కార్యవర్గం తీర్మానించింది. కాగా 2011 మహాసభలను న్యూజెర్సీలో నిర్వహించనున్నట్టు తానా ప్రాంతీయ ఉపాధ్యక్షుడు వాసుదేవ ఆర్ చిన్నా తెలిపారు.